క్లుప్తంగా...

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

రాంగోపాల్‌పేట్: శంకర్ నేత్రాలయ బల్కంపేట, లయన్స్ బంజారా గ్రేటర్ ఆధ్వర్యంలో ఈ నెల 5న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రవీందర్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. పాటిగడ్డ ఎస్‌బీటీనగర్‌లోని కమిటీ హాల్‌లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, కంటి అద్దాలు పంపిణీ చేస్తారని, అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మణిపూర్ దాడులకు నిరసనగా 6న శాంతి ర్యాలీ

రాంగోపాల్‌పేట్: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఈ నెల 6న ఆదివారం సికింద్రాబాద్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మణిపూర్ రాష్ట్రంలో మహిళలను నగ్నంగా ఊరేగించడంతో పాటు చర్చీలు, ఇళ్లు దహనం చేయడం దారుణమన్నారు. ఈ ర్యాలీ మదర్ థెరీసా విగ్రహం నుంచి సంగీత్ చౌరస్తా, సెయింట్ జాన్సన్ స్కూల్, వైఎంసీఏ, గార్డెన్ హోటల్, మీదుగా చర్చి వరకు కొనసాగుతుందన్నారు.

బాధ్యతల స్వీకరణ



కార్యాలయ సిబ్బందితో తహసీల్దార్ భీమయ్యగౌడ్

అమీర్‌పేట: అమీర్‌పేట తహసీల్దార్‌గా భీమయ్యగౌడ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు పనిచేసిన విష్ణుసాగర్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో భీమయ్యగౌడ్ బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది సాదరంగా స్వాగతం పలికారు. 2016 బ్యాచ్‌కు చెందిన భీమయ్య మక్తల్, ధారూర్, బంట్వారం, దుద్యాడ మండలాల్లో తహశీల్దార్‌గా పనిచేశారు.

డిప్యూటీ మేయర్‌ను కలిసిన ఏసీపీ



లాలాపేట: ఇటీవల నార్త్ జోన్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన సైదయ్య శుక్రవారం జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డిని ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శాంతి భద్రత పరిరక్షణలో తెలంగాణ పోలీసు బేష్ అని డిప్యూటీ మేయర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు మోతే శోభన్‌రెడ్డి తదితరులున్నారు.

7న తిరుపతిలో ఓబీసీ మహాసభలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ స్టేడియంలో ఈ నెల 7న నిర్వహించనున్న ఓబీసీ 8వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం కేంద్రకమిటీ అధ్యక్షులు తాటికొండ విక్రమ్‌గౌడ్, రాష్ట్ర అధ్యక్షులు గొడుగు మహేష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి ఓయూ నాయకులు సతీష్, కిరణ్‌గౌడ్, మహేష్, విజయ్, నరేష్, సంపత్, వికాస్, అనిల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు కృషి

మారేడ్‌పల్లి మండల తహశీల్దార్ పద్మ సుందరి



అడ్డగుట్ట: ప్రభుత్వ భూముల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తానని మారేడ్‌పల్లి మండల తహశీల్దార్ పద్మ సుందరి అన్నారు. మారేడ్‌పల్లి మండల తహశీల్దార్‌గా శుక్రవారం ఆమె బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు ఇక్కడ విధులు నిర్వహించిన తహశీల్దార్ మాధవీ రెడ్డి బదిలీపై బాలాపూర్ మండలానికి వెళ్లడంతో ఆమె స్థానంలో బొమ్మలరామారం మండల తహశీల్దార్‌గా పని చేస్తున్న పద్మ సుందరి నియమితులయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తహశీల్దార్ మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. భూ కబ్జాలకు పాల్పడేవారు ఎంతటివారైన చర్యలు తప్పవన్నారు. కుల, ఆదాయ, ఇతర ధృవపత్రాల జారీలో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు కూడా మండల కార్యాలయం అధికారులు, సిబ్బందికి సహకరించాలన్నారు.

బోనాల వేడుకలకు ఆలయాలు ముస్తాబు

- బన్సీలాల్‌పేట్ పరిసర దేవాలయాల్లో 6, 7 తేదీల్లో బోనాల వేడుకలు



బోనాల వేడుకలకు ముస్తాబైన సీసీ నగర్ శ్రీ నల్లపోచమ్మ దేవాలయం

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ బన్సీలాల్‌పేట్ పరిసర ప్రాంతాల్లో ఈ నెల 6, 7 తేదీల్లో జరిగే అమ్మవారి బోనాల వేడుకల నేపథ్యంలో ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. అమ్మవారి బోనాల వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి నిర్వాహకులు సన్నాహాలు చేపట్టారు. దేవాలయాలకు రంగులు వేసి, పరిసరాలను విద్యుత్ దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని బోయిగూడ, సీసీ నగర్, బోలక్‌పూర్, గొల్లకొమురయ్య కాలనీ, ఐడీహెచ్ కాలనీ, బండమైసమ్మ బస్తీ, బన్సీలాల్‌పేట్ ప్రాంతాల్లో సందడి నెలకొంది. ఈ నెల 6 ఆదివారం బోనాల పండుగ, 7 సోమవారం అమ్మవారి రంగం కార్యక్రమంలో పాటు జల్లి కడవ ఉరేగింపు నిర్వహించనున్నారు. బోనాల సందర్భంగా అమ్మవారిని సందర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఎప్పటి లాగే ఈ సంవత్సరం కూడా బోనాల వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించడానికి చర్యలు తీసుకున్నట్లు ఆలయ నిర్వాహకులు వెంకయ్య, రాగటి సత్యం, ఎం. రవి కుమార్, వై. సురేష్, వి. నారాయణ, యేసు, కేఎం క్రిష్ణ, శివ, సురేష్, వెంకటేషన్, ఈశ్వర్, బంటీ, సాగర్ పేర్కొన్నారు. బోనాల పండుగ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి అమ్మవారి తొట్టెలను బాజా భజంత్రీల మధ్య, పోతరాజుల నృత్యాలతో ఆలయాలకు తీసుకువస్తారు.

ప్రత్యేక ఆకర్షణగా ఫలహారపు బండ్ల ఊరేగింపు

బోనాల వేడుకల్లో అమ్మవారి ఫలహారపు బండ్ల ఉరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఈ నెల 6న అమ్మవారి ఫలహారపు బండ్లను ఉరేగిస్తారు. పోతరాజుల నృత్యాలు, బ్యాండ్ మేళాల మధ్య భారీ లైటింగ్‌తో అమ్మవారి ఫలహారపు బండ్ల ఉరేగింపు ప్రజలకు కనువిందు చేస్తాయి. ఆదివారం రాత్రి బీజేఆర్ నగర్ నుంచి ఫలహారపు బండ్ల ఉరేగింపు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బొడ్డు మహేష్, ఎం. రవీందర్, కొండూరు మహేష్, డి. కైలాష్ తెలిపారు.

హాజరుకానున్న ప్రముఖులు

బోనాల వేడుకల సందర్భంగా బన్సీలాల్‌పేట్ పరిసర ప్రాంతాల్లోని పలు దేవాలయాలను పలువురు అధికార, రాజకీయ ప్రముఖులు సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇప్పటికే ఆలయ నిర్వాహకులు ప్రముఖులకు ఆహ్వాన పత్రాలను అందజేశారు. రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, కార్పొరేటర్ కె. హేమలత, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. అంజన్‌కుమార్ యాదవ్, డాక్టర్ రవీందర్ గౌడ్ తదితరులు పలు దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేస్తారు.

భారీ బందోబస్తు ఏర్పాటు : సీఐ ఎన్. రవి



బోనాల పండుగ సందర్భంగా బన్సీలాల్‌పేట్ పరిసర ప్రాంతాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎన్. రవి తెలిపారు. అమ్మవారి బోనాలు, జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా దేవాలయాల వద్ద అదనపు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజలు బోనాల వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని సూచించారు. గొడవలు, అల్లర్లు చేసే వ్యక్తులు, శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఎక్కడ ఎలాంటి గొడవలు, అల్లర్లు జరిగినా ప్రజలు తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

పారిశుద్ధ్య కార్మికులకు అండగా ఉంటాం



పారిశుద్ధ్య కార్మికులకు మందులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్: పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తమ వంతు సహకారం అందిస్తామని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ అన్నారు. శుక్రవారం సీతాఫల్‌మండీ మల్టీ పర్పస్ కమ్యూనిటీహాల్‌లో జీహెచ్ఎంసీ అధికారులు, పారిశుద్ధ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో చెత్త తరలింపు పారిశుద్ధ్య సమస్యలపై సమీక్షించారు. పలువురు కార్మికులు తమకు ఎదురవుతున్న సమస్యలను వివరించారు. దీనిపై స్పందించిన కార్పొరేటర్ సమస్యలు పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు. అనంతరం కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధవి, పర్యావరణ పరిశుభ్రత పర్యవేక్షకురాలు యమున తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో జీహెచ్ఎంసీ సిబ్బంది నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న యూనియన్ నాయకులు

రాంగోపాల్‌పేట్: శానిటేషన్ జవాన్లను రాత్రి విధుల్లో నియమిస్తూ ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆరోపిస్తూ శుక్రవారం సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయం ఎదుట భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ జోనల్ అధ్యక్షులు ప్రకాష్ ఆధ్వర్యంలో కార్యాలయం ఎదుట కొద్దిసేపు ఆందోళన నిర్వహించి జోనల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి పూట విధులు నిర్వహించాలని శానిటరీ జవాన్ ఎస్ దాస్‌పై అధికారులు ఒత్తిడి తేవడంతో ఆయన మృతి చెందాడన్నారు. అధికారులు తమ ఆదేశాలను ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు రహీం పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న మాజీ మేయర్ కార్తీకరెడ్డి

అడ్డగుట్ట: శాంతినగర్‌లోని దుర్గా దేవి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చండీ హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులందరూ పెద్ద సంఖ్యలో దుర్గామాతను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం, ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు శంకర్ లాల్, శారద బాయి, సంతోష్, నర్సింగ్‌రావు, బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్ష వాయిదా వేయాలి



ఆర్ట్స్ కాలేజీ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: గ్రూప్-2 పరీక్షను వాయిదా వేయాలని విద్యార్థులు, నిరుద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల సంజయ్, జేఏసీ నేత సురేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఓయూ లైబ్రరీ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు ర్యాలీ చేపట్టి ధర్నా నిర్వహించారు. వరుస పోటీ పరీక్షల కారణంగా విద్యార్థులు సరిగా ప్రిపేర్ కాలేకపోతున్నారని ఆ నేపథ్యంలో గ్రూప్-2 పరీక్షను కనీసం మూడు నెలలైనా వాయిదా వేయాలని కోరారు. లేని పక్షంలో వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

అడ్డంకులు తొలిగాయి

సాక్షి ఎఫెక్ట్..



దుకాణాల నిర్వాహకులకు సూచనలు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాస్

బౌద్ధనగర్: బౌద్ధనగర్ డివిజన్‌లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. శుక్రవారం 'రోడ్డంతా పార్కింగ్' పేరుతో 'సాక్షి'లో ప్రచురితమైన ప్రత్యేక కథనంపై స్పందించిన చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాస్, ఎస్సై కరుణాకర్ సిబ్బందితో కలిసి వారాసీగూడ, బౌద్ధనగర్, మహ్మద్‌గూడ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనాలకు ఇబ్బందులు కలిగించేలా ఫుట్‌పాత్‌లు, రోడ్లు ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్న వారిని హెచ్చరించారు. వాహనదారులకు ఇబ్బందులు కలిగించకుండా వ్యాపారాలు నిర్వహించుకోవాలని సూచించారు. కొన్ని కాలనీల్లో రోడ్డుకు ఇరువైపుల పార్కింగ్ చేసిన కార్లు, వాహనాల యజమానులతో మాట్లాడారు. ఎవరి స్థలాల్లో వాళ్లు పార్కింగ్ చేసుకోవాలని రోడ్డుపై వచ్చి వెళ్లే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. అలాగే ట్రాఫిక్ అవాంతరాలు కలిగిస్తున్న వారికి ఛలాన్లు విధించారు.

పేదల అభ్యున్నతే కాంగ్రెస్ ధ్యేయం



రెయిన్ కోట్లు అందజేస్తున్న నీలిమ

అమీర్‌పేట: అందరికి విద్య ,ఉపాధి, సామాజిక న్యాయం కల్పించి పేదల అభ్యున్నతే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ అన్నారు. శుక్రవారం ఆమె సనత్ నగర్ డివిజన్ దాసారం బస్తీ గుడిసెల్లో 300 మంది చెత్త సేకరించే కార్మికులకు ఉచితంగా రెయిన్ కోట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఆహార భద్రత, ఉపాధి కల్పించడంలో కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజా సంక్షేమ విధానాలను అవలంభించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మణ్,నవీన్‌రాజ్,ఎలీశా తదితరులు పాల్గొన్నారు.

ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి సాక



రాంగోపాల్‌పేట్: బోనాల జాతరలో భాగంగా భవిష్యవాణిలో అమ్మవారు చెప్పినందున రెండో శుక్రవారం ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి సాక సమర్పించారు. 108 సాకలతో వెయ్యి మంది మహిళలు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి, చైర్మన్ పరమేశ్వర్, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు నిర్మించండి



కంటోన్మెంట్: మిలటరీ ఆంక్షల కారణంగా మౌలిక సదుపాయాలకు నోచుకోని సాయిబాబా హట్స్‌లో కనీసం టాయిలెట్‌లు నిర్మించాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ నేత శ్రీగణేష్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. బోర్డు తరపున పనులు చేపట్టే అవకాశం లేకపోతే, తన ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయిస్తానన్నారు. త్వరలోనే బోర్డు ఆధ్వర్యంలో సాయిబాబా హట్స్‌లో బయోటాయిలెట్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని సీఈఓ హామీ ఇచ్చారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా మొత్తం 8 టాయిలెట్‌లు ఏర్పాటు చేస్తామని సీఈఓ తెలిపారు.

ఘరానా దొంగల ముఠా అరెస్ట్

సికింద్రాబాద్: రైళ్లు, రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల నగదు, విలువైన వస్తువులు, ఆభరణాలను దొంగిలిస్తున్న ఐదుగురు ఘరానా దొంగల ముఠాను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి 8 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. రైల్వే డీఎస్పీ నర్సయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో చోరీలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందడంతో సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించిన పోలీసులు ఈ నెల 3న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వెయిటింగ్ హాల్‌లో అనుమానాస్పదంగా కనిపించిన ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాలు వెలుగులోకి వచ్చాయి. మహారాష్ట్రకు చెందిన జాదవ్ రంజిత్, శివాజీ సునీల్, కరణ్ ఉత్తమ్ పవార్, కాలేభౌసాహెబ్ మహదేవ్, మోర్ అజయ్ ప్రకాశ్ ముఠాగా ఏర్పడి రైళ్లు, రైల్వే స్టేషన్లలో చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకున్న ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులకు డీఎస్పీ నర్సయ్య అభినందించారు.

కొనసాగుతున్న కాంట్రాక్టు అధ్యాపకుల పాదయాత్ర



మాట్లాడుతున్న రామేశ్వర్‌రావు

ఉస్మానియా యూనివర్సిటీ: ముఖ్యమంత్రి కేసీఆర్ ఇష్ట దైవం సిద్దిపేట జిల్లా, కోయినపల్లి వెంకటేశ్వర ఆలయం వరకు ఉద్యోగాల పర్మనెంట్ కావాలని కాంట్రాక్టు అధ్యాపకులు చేపట్టిన పాదయాత్ర 2వ రోజుకు చేరుకుంది. ఈ నెల 3న ఓయూ ఆర్ట్స్ కాలేజీ నుంచి ప్రారంభమైన యాత్ర శుక్రవారం 50 కిలోమీటర్లకు (గజ్వేల్) చేరుకున్నట్లు తెలంగాణ ఆల్ వర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్ల జేఏసీ వర్కింగ్ చైర్మన్ డాక్టర్ రామేశ్వర్‌రావు తెలిపారు. తెలంగాణ ఉద్యమం, ఆ తర్వాత ఏర్పడిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి తాము అనుకూలంగా పని చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి తమను పర్మనెంట్ చేస్తారనే ఆశతో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ డా. శ్రీధర్‌కుమార్, కో-చైర్మన్లు చందులాల్, డా.హరీష్, డా.రవీందర్‌రెడ్డి, డా.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అధిష్టానం ఆదేశిస్తే సికింద్రాబాద్ నుంచి పోటీ చేస్తా



నాగులూరి సాయిబాబా

చిలకలగూడ : అధిష్టానం ఆదేశిస్తే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నాగులూరి సాయిబాబా అన్నారు. చిలకలగూడ సాయిలత ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నప్పటికీ సామాజిక సేవా కార్యక్రమాలపై దృష్టి పెట్టానని, ఇప్పుడు రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించేందుకు నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అధిష్టానం తనకు టికెట్ కేటాయిస్తే అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తానని, వేరొకరికి టిక్కెట్ ఇచ్చినా పార్టీ నిర్ణయానికి కట్టుబడి కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తం అందించే వ్యక్తిగా స్థానికుడైన నాగులూరి సాయిబాబా అన్నివర్గాల ప్రజలకు సుపరిచితుడని గ్రేటర్ హైదరాబాద్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు అచ్యుత రమేష్ బాబు అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ ప్రతినిధులు దేవుడు వెంకటేష్, ప్రవీణ్‌కుమార్, కమలాకర్, అరుణ్‌కుమార్, రాజు, కాంగ్రెస్ నాయకులు తుమ్మ శ్రీను, సతీష్, ప్రమోద్, ఆంజనేయులు, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో వసతులు కల్పించండి

కంటోన్మెంట్: బోయిన్‌పల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మార్కెట్ యార్డులో బోర్డు ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని మార్కెట్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మార్కెట్ కమిటీ చైర్మన్ హారిక ఆనంద్ గౌడ్ నేతృత్వంలో సభ్యులు శుక్రవారం బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ మార్కెట్‌లోని షాపులకు సంబంధించిన ఆస్తి పన్ను బోర్డు కార్యాలయంలోనే చెల్లిస్తున్నా, తమకు బోర్డు తరఫున ఎలాంటి వసతులు కల్పించడం లేదన్నారు. తాగునీటి కనెక్షన్, సీవరేజీ లైన్‌లను అభివృద్ధి చేయాలని కోరారు. మార్కెట్ సంబంధించిన అంశంపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించి త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని సీఈఓ వారికి హామీ ఇచ్చారు. సీఈఓను కలిసిన వారిలో మార్కెట్ కమిటీ గ్రేడ్ 2 సెక్రెటరీ సత్యనారాయణ, గ్రేడ్ 3 సెక్రెటరీ ఖాజా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, పాలకమండలి సభ్యులు మాదిశెట్టి గిరిధర్, దేవులపల్లి శ్రీనివాస్, మీనా భాస్కర్, రామకృష్ణ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల పై నిషేధం అప్రజాస్వామికం

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్‌లో విద్యార్థి సంఘాల నేతలు, మీడియా ప్రతినిధులను ప్రవేశించకుండా నిషేధం విధించడం అప్రజాస్వామికమని టీజేఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ వినద్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమస్యలున్న చోట విద్యార్థి సంఘాలు పోరాడుతాయన్నారు. అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వ విద్యా సంస్థలు, వసతి గృహాల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

సుప్రీంకోర్టు తీర్పు బీజేపీకి చెంప పెట్టు



మిఠాయిలు పంచుతున్న కాంగ్రెస్ నేతలు



సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

సనత్‌నగర్: గుజరాత్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే విధిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలు బీజేపీ నాయకులకు చెంపపెట్టులాంటివని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ రవీందర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం స్టే రావడంతో బల్కంపేటలోని కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన మిఠాయిలు పంచి పెట్టారు. బీజేపీ ప్రభుత్వం దేశంలో మత విద్వేశాలను పెంచి పోషిస్తూ ప్రజలను రెచ్చగొడుతుతుందన్నారు. ప్రజలు వీటిని గమనిస్తున్నారని త్వరలోనే బీజేపీకి బుద్ధి చెబుతారన్నారు. రాహుల్‌గాంధీపై కుట్రపూరితంగా అనర్హత వేటు వేయించారని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రమేష్, నాయకులు కమల్‌రాజ్, గిరిజన విభాగం జిల్లా అధ్యక్షులు ప్రతాప్ అజ్జు సత్యనారాయణ, శ్రీనివాస్‌గౌడ్, రాజు, రవికుమార్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సీతాఫల్‌మండిలో కాంగ్రెస్ సంబరాలు

సికింద్రాబాద్: సుప్రీం కోర్టులో రాహుల్‌గాంధీకి ఊరట లభించడంతో సీతాఫల్‌మండిలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. సికింద్రాబాద్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నోముల ప్రకాశ్‌రావుగౌడ్ నేతృత్వంలో సీతాఫల్‌మండి అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు కోర్టు తీర్పు పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాజకీయ కుట్రతోనే కేంద్రం రాహుల్‌గాంధీపై కేసులు నమోదు చేయించిందన్నారు. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎంఆర్ శ్రీనివాస్‌రావు, కాంగ్రెస్ నాయకులు జగదీశ్, సురేశ్‌లాల్, వాహిత్, అభిషేక్, బబ్లు, అరుణ్‌కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ మాటలు అవాస్తవం

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు నిర్వహించకుండా కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ అన్నారు. శుక్రవారం ఆయన పికెట్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో బీజేపీ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ అబద్ధాలకు అంతులేకుండా పోయిందన్నారు. జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్ విలీనానికి తాను వ్యతిరేకం అంటూ కేంద్రం, బీజేపీ అధిష్టానం నిర్ణయాన్ని సైతం ధిక్కరిస్తున్నాడన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయంలో రామకృష్ణ వ్యాఖ్యలు అర్థరహితం అన్నారు. 2022 నాటికి పేదలందరికీ ఇళ్లు ఇప్పిస్తామని చెప్పిన ప్రధాని నరేంద్ర మోదీని అడగాలన్నారు. తాము ఇళ్లు ఇచ్చినట్లు పత్రికా ప్రకటనలో పేర్కొన్న మహిళకు సైతం ఇల్లు ఇవ్వలేదన్న విషయాన్ని జాతీయ మీడియా బయటపెట్టిన విషయం తెలియదా అన్నారు. కంటోన్మెంట్‌లో అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందుతాయన్నారు. జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్ విలీనంపై బీజేపీ వైఖరి స్పష్టం చేశాకే కిషన్ రెడ్డి కంటోన్మెంట్‌లో అడుగుపెట్టాలన్నారు. ఉచిత మంచినీటి విషయంలో రామకృష్ణ అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాడని, తాను కోర్టుకెళితేనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించిందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రామకృష్ణ తన దందాల కోసమే బీజేపీలో చేరి నామినేటెడ్ సభ్యుడిగా అవకాశం దక్కించుకున్నాడని ఆరోపించారు. ఎన్నికలు నిర్వహించకుండా పదే పదే పదవీ కాలాన్ని పొడిగించుకుంటూ పబ్బం గడుపుకుంటున్నారన్నారు.

ఉచిత ఆన్‌లైన్ కేంద్రాలకు విశేష స్పందన



బోయిన్‌పల్లి కమ్యూనిటీ హాల్‌లో ఉచిత ఆన్‌లైన్ సేవా కేంద్రాన్ని ప్రారంభించిన శ్రీ గణేష్

రసూల్‌పురా: ప్రజల సంక్షేమం కోసం శ్రీ గణేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఉచిత ఆన్‌లైన్ సేవా కేంద్రా లకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఫౌండేషన్ వ్యవస్థాపకులు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీ గణేష్ తెలిపారు. శుక్రవారం నియోజకవర్గం లోని బోయిన్ పల్లి బాబి కమ్యూనిటీ హాల్, అన్నానగర్ బీరప్ప టెంపుల్, మడ్‌ఫోర్ట్ అంబేడ్కర్‌నగర్, బొల్లారం బస్టాండ్ సమీపంలో ఆన్‌లైన్ ఉచిత కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు పొందేందుకు పేదలు ఆన్‌లైన్ సెంటర్ల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడకుండా వారికి అందుబాటులో కేంద్రాలను ఏర్పాటు చేసి ఉచితంగా సేవలను అందజేస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 15 ఆన్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని వాటి పనితీరు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అయా బస్తీల ప్రజలు పాల్గొన్నారు.